'ఐఎస్‌బీ'లో 4వ ఐఆర్‌సీఐబి సమావేశం

28,29 తేదీలలో నిర్వహణకు ఏర్పాట్లు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో 4వ 'ఇంటర్నేషనల్ రీసెర్చ్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ' పేరిట ప్రత్యేక ప్లీనరీ సెషన్‌లో పలువురు ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. ఈనెల 28,29వ తేదీలలో ఈ రెండు రోజుల సమావేశాలను నిర్వహిస్తారు. 28వ తేదీన ఉదయం 9.30 గంటలకు ప్రారంభ కార్యక్రమాన్నిఏర్పాటు చేశారు. ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఐబీబీఐ చైర్మన్ రవిమిట్టల్, నీతిఆయోగ్ సీఈఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం, తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కె రామకృష్ణారావు, ఐఎస్‌బీ ప్రొఫెసర్ సంజయ్‌కల్లాపూర్, టోరంటో ప్రొఫెసర్ దుష్యంత్ వ్యాస్, డిలాయిట్ మాజీ చైర్మన్ పిఆర్ రమేష్ ప్రత్యేక ఉపన్యాసాలు చేస్తారు.

ఆలోచింపజేసిన 'ఈఫినాలె'

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్–హెక్సావేర్ టెక్నాలజీస్ సంయుక్తంగా ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఏ) పర్యవేక్షణలో 'ఏఐ ఫర్ లైఫ్ సైన్సెస్' ఛాలెంజ్‌పై ఈ ఫినాలేను నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీలోని స్టార్టప్‌లు పిచ్‌లు, మెంటర్లు జ్యూరీ సభ్యులు పరిశీలించి టాప్–5 స్టార్టప్‌లను ఎంపిక చేసినట్లు శనివారం ప్రకటించారు. ఈ ఛాలెంజ్‌కు 130 దరఖాస్తులు వచ్చాయి. అందులో 30 స్టార్టప్‌లు షార్ట్ లిస్ట్ చేశారు. 17వ రెండవ రౌండ్‌కు చేరగా ఫైనల్‌కు 13 స్టార్టప్‌లు చేరుకున్నాయి. గ్రాండ్ ఫినాలేకు అయిందింటిని ఎంపిక చేశారు. అందులో సిబర్ట్స్ ఏఐ స్టార్టప్ విజేతగా ప్రకటించారు.

గోపన్‌పల్లిలో ప్రభుత్వ భూమిని కాపాడాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని సర్వేనెంబర్ 178లోని 30 గుంటల స్థలాన్ని కాపాడాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దృష్టికి ట్రిక్స్‌స్కైవుడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం కోరారు. కాలనీలో ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ స్థలాన్ని కాపాడాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని కూడా అందించినట్లు వారు వివరించారు.గతంలో శ్మశానవాటిక స్థలంగా ఉపయోగించే వారని ఈ స్థలాన్ని కాపాడాలని వారు సూచించారు. అంతేకాకుండా నాలా పనులు, వీధిదీపాలు, ఇతర సమస్యలపై ఆయనకు వినతిపత్రాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు పిఎస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిబిరెడ్డి సభ్యులు విద్యాధర్, హేమ చంద్ర పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన జర్నలిస్టులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని జర్నలిస్ట్‌కాలనీ ఫేజ్–3లో నెలకొన్న సమస్యలను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడిగాంధీని కలిసి సీనియర్ జర్నలిస్టులు, జేసీహెచ్‌ఎస్‌ఎల్‌ఖ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడుగోపరాజు ఆధ్వర్యంలో వివరించారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో జర్నలిస్టుకాలనీ ఫేజ్–3లో నివాసముండే జర్నలిస్టులు కాలనీ సమస్యలను వివరించారు. దీంతో వారి సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే డ్రైనేజీ పనులకు సంబంధించి అధికారులకు లేఖ రాస్తానని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మహేశ్వర్, కమలాకరాచార్య, వేణుగోపాలరావు, ప్రభాకర్‌రావు, హన్మంతురావు, సైదారెడ్డి, పెద్దిరాజు, ప్రతాప్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, నర్సింహ్మారావు, బాలశేఖర్‌శర్మ, బాలమురళి,కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలో సినీటౌన్, జేపీనగర్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు శనివారం తొలగించారు. మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ పర్యావేక్షణలో రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారాలను తొలగించారు. ట్రాఫిక్ వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.



దీప్తీశ్రీనగర్ కాలనీలో..



లక్ష్మీనగర్ కాలనీలో..

రోడ్లపై రోజుల తరబడి మురుగు

మియాపూర్: రోడ్లపై మురుగు ప్రవాహం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు, గుంతలమయమైన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువైయ్యారని, రోజుల తరబడి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్న పట్టించుకోవడం లేదంటూ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో కాలనీ, బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్‌లోని దీప్తీశ్రీనగర్, ఎంఏనగర్, స్టాలిన్ నగర్, లక్ష్మీనగర్, న్యూ కాలనీ, దత్తసాయి నగర్, జేపీఎన్‌నగర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు, డైనమిక్ కాలనీ, డోవా కాలనీతో పాటు పలు కాలనీల్లో రోడ్లపై మురుగు పారుతోంది. రోజుల తరబడి మురుగు ప్రదాన రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రోడ్ల వెంబడి వెళ్లే స్థానిక ప్రజలు మురుగు, దుర్వాస భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ సిబ్బంది వచ్చి తూ.తూ.. మంత్రంగా మరమ్మత్తులు చేసి వెళ్తున్నారే తప్పా.. శాశ్వత పరిష్కారం చూపడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. .



మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డులో..



డైనమిక్ కాలనీలో..



న్యూ కాలనీలో..



దత్తసాయి కాలనీలో ..

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు, బతుకమ్మ, శారీమేళాలో భాగంగా శనివారం భరతనాట్యం, ఒడిస్సీ నృత్యప్రదర్శనలతో అలరించారు. దివ్యశ్రీ, ఆర్వీ, ధన్వి, వన్య, అన్విక, శుభశ్రీ, అంకిత, ఐశ్వర్య, ప్రియ తదితరులు పాల్గొన్నారు.





రోగుల కోసం ప్రత్యేక సంగీత కార్యక్రమం



రాయదుర్గం: కేన్సర్ రోగుల కోసం ప్రశాంతత కోసం ఖాజాగూడలోని స్పర్శ్ హస్పిటల్ పాలియేటివ్ కేర్‌లో రోగులు, వారి బంధువుల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సంగీత కార్యక్రమం నిర్వహించారు. త్యాగరాయ గానసభ సంగీత కళాశాల ప్రిన్సిపల్ సంయుక్తా చివ్వలూరి కీర్తనలతో అందరినీ అలరించారు. రోటరీ క్లబ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు రోటేరియన్ నీరజ గోడవర్తి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ క్లబ్ సభ్యులు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్‌లో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ సభ్యులు మొక్కలు నాటారు. విద్యార్థి దశలోనే సేవాభావన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. క్లబ్ అధ్యక్షురాలు నీరజగొడవర్తి, ప్రిన్సిపల్ పద్మకొల్లి పాల్గొన్నారు.

'సేవా పఖ్వాడా'లో భాగంగా స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం

చందానగర్: దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా పఖ్వాడా (సేవా కార్యక్రమాల పక్షత్సవాలు)లో భాగంగా బీజేపీ హఫీజ్‌పేట్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు జితేందర్ అధ్యక్షతన ఓల్డ్ హఫీజ్‌పేట్‌లోని హనుమాన్ దేవాలయంలో మోడీ పేరు మీద ప్రత్యేక పూజలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రధానీ నరేంద్ర మోడీ నిస్వార్థ సేవ, దేశాభివృద్ధికి ఆయన పడుతున్న తపన ప్రతీ కార్యకర్తకు, ప్రతి పౌరునికి ఆదర్శనీయమన్నారు. మాజీ కౌన్సిలర్ రమణయ్య, జితేందర్, రవి గౌడ్, శ్రీధర్ గౌడ్, శ్రీశైలం, సత్యనారాయణ, బాబు రెడ్డి, జగన్ గౌడ్ పాల్గొన్నారు.



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న మహేష్ యాదవ్, బీజేపీ నాయకులు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి..నెరవేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచడంతోపాటు, కొత్త పెన్షన్ మంజూరు చేయాలంటూ శనివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేశారు. అనంతరం తహసీల్దార్ రంగారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పెన్షన్ రూ.4,016 నుంచి రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువులతోపాటు మిగతా చేయూత పింఛన్లు రూ.2,016 నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాని కోరారు. కార్యక్రమలో మహిళా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు మేరీ, సత్యనారాయణ, చెన్నారెడ్డి, అంజమ్మ, ధనలక్ష్మి, శ్రీకాంత్, మల్లేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి



విద్యార్థులతో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: విద్యార్థుల్లో దేశభక్తి, సృజనాత్మతక, సామాజిక అవగాహన పెంపొందించాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. ప్రధానమంత్రి మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడ్ కార్యక్రమంలో రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గౌలిదొడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్, ఆపరేషన్ సింధూర్ వంటి జాతీయ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు,బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల పట్ల చదువుతోపాటు ఆసక్తిని పెంచుకొనేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కేతాజ్‌బాబు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వరదనీటిని పరిశీలించిన అధికారులు



గచ్చిబౌలిలో రోడ్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ అధికారులు

గచ్చిబౌలి: ప్రధాన రోడ్లపై వర్షం పడితే వరద నీరు పారే ప్రాంతాలను సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు శనివారం పరిశీలించారు. ముఖ్యంగా గచ్చిబౌలి, బొటానికల్ గార్డెన్ వంటి ప్రాంతాలలో ట్రాఫిక్ మాదాపూర్ డీసీపీ సాయిమనోహర్, ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి పర్యటించి ఆయా ప్రాంతాలలో అధికారులకు పలు సూచనలు చేశారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రాతో కలిసి సమస్యలు తలెత్తకుండా సాఫీగా వాహనాల రాకపోకలు సాగేలా చూడాలని ఆదేశించారు. వరద నీరు రోడ్లపైకి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా చూడాలని సూచించారు. ఎంత వర్షం పడినా రోడ్లపైకి వరద నీరు రాకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించాలన్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రాంతాలలో భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎప్పటికప్పుడు వాహనదారులకు రోడ్ల పై ఉండే పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకానికి ప్రోత్సాహం

ముగిసిన ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్



మాదాపూర్: భూతల స్వర్గంగా గుర్తింపు పొందిన కాశ్మీర్‌లో పర్యాటకులకు పెద్దపీట వేస్తున్నట్లు ఆ రాష్ట్ర పర్యాటకశాఖ ప్రకటించింది. ఇక్కడికి వచ్చే సందర్శకులను ప్రత్యేక ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు ప్రకటించింది. నగరంలోని హెచ్‌ఐసీసీ వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించిన ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ శనివారం ముగిసింది. ఈ మేరకు ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు జయేష్ రంజన్, జమ్ముకాశ్మీర్ పర్యాటకశాఖ ఓఎస్డీ ముస్తాక్‌ల నుంచి ప్రమోటింగ్ టూరిజం అవార్డును అందుకున్నారు. జమ్ముకాశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు నవంబర్ 2న కాశ్మీర్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లకు రూ. 9.95 లక్షలు



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డీసీ శశిరేఖ

చందానగర్: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని చందానగర్ సర్కిల్ 21 పరిధిలో రూ.9.95 లక్షల నిధులతో బతకమ్మ నిమజ్జన ఏర్పాట్లు చేపడుతున్నామని ఉపకమిషనర్ శశిరేఖ పేర్కొన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఇంజనీరింగ్, పారిశుధ్య, టౌన్‌ప్లానింగ్, ఎలక్ట్రికల్, యూబీడీ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం ఆమె నిర్వహించారు. డీసీ శశిరేఖ మాట్లాడుతూ హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో బతుకమ్మ, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం కోసం కొత్తకుంట, ఈర్ల చెరువు వద్ద ఏర్పాట్ల కొరకు రూ.85 వేలు, కాయిదమ్మ కుంట వద్ద రూ.3.40 లక్షలు, మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు వద్ద రూ.2.70 లక్షలు, చందానగర్ డివిజన్ పరిధిలోని తారానగర్, శివాజీ నగర్, గంగారం చెరువు, శబరి కాలనీ, శుభోదయ, భవానీ శంకర్ నగర్, రెడ్డి కాలనీ, సాయి బాబా టెంపుల్ (అన్నపూర్ణ ఎన్‌క్లేవ్)లలో బేబి పాండ్లను తాత్కాలికంగా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. కోనేరుల వద్ద విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, మియాపూర్ జంక్షన్, ఆల్విన్ కాలనీ చౌరస్తాలో, హైటెక్స్ కమాన్ వద్ద బతుకమ్మ నమూనాలను ఉంచనున్నామన్నారు. సమావేశంలో ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్ ఈఈ ఇందిరా బాయ్, డీఈ దుర్గప్రసాద్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి కుమార్, ఎస్ఎస్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ శివాజీనగర్ వీకర్ సెక్షన్ ప్రైమరీ స్కూల్‌లో ప్రదాన మంత్రి నరేంద్రమోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు బీజేపీ నాయకులు డ్రాయింగ్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు రాకేష్ దూబే పాల్గొన్నారు.



క్యాండిల్ ఇన్ ది విండ్స్ పుస్తకావిష్కరణ



మాదాపూర్: ప్రముఖ ట్రూక్రైమ్ రచయిత విక్రమ్‌రాణా మిస్టరీ సిరీస్ రచయిత శర్మిష్టా షెనాయ్ తాజా పుస్తకం క్యాండిల్ ఇన్ ది విండ్స్ పుస్తకాన్ని శనివారం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో తెలంగాణ సైబర్ సెక్యూరిటి బ్యూరో, డైరెక్టర్ శిఖాగోయల్ ఆవిష్కరించారు. మహిళలపై జరిగిన నేరాలను పోలీసుకేస్ ఫైల్స్ ఆధారంగా సమగ్రంగా వివరించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఉషారామన్ పాల్గొన్నారు.

సందడిగా బతుకమ్మ వేడుకలు





గచ్చిబౌలి: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండాపూర్ రాఘవేంద్రకాలనీలోని సంస్కృతి హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తులు ధరించిన బాలికలు, ఉపాధ్యాయులు ఆడుతూపాడుతూ బతుకమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. రకరకాల పూలతో బతుమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో ఆతర్వాత పూజలను నిర్వహించి బతుకమ్మ పాటలు పాడుతూ సందడిగా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అయ్యారు.

మియాపూర్: మియాపూర్ దీప్తీశ్రీ నగర్ కాలనీలోని ఐరిస్ ఫ్లోరెడ్స్ పాఠశాలలో విజయదశమి, బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి సందడి చేశారు. పలు రకాల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆడారు. అదేవిధంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులకు విజయదశమి, బతుకమ్మ విశిష్టతను తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పూలతో బతుకమ్మను తయారు చేసి భక్తి శ్రద్దలతో పాటలు పాడారు. వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రారెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.





